05082024-MAI-04_Layout 1 8/5/2024 1:31 AM Page 1

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

చెమట చుక్కలు

వాళ్లు పొద్దున్నే నిద్ర లేచి
పూట కోసం వేటను
మొదలెడతరు
పొయ్యి మీదకు పిరికెడు గింజల కోసం
పొద్దంతా పెయ్యిని హూనం చేస్తరు

వాళ్లు చెమట చుక్కలను చిందిస్తేనే కదా
మన కంచంలో బువ్వ పూలు పూసేది
వాళ్ల కండలు కర్పూరంలా కరిగిపోతేనే కదా
మన గుండెల గోడలు గట్టి పడేది
వాళ్ల రెక్కలను ముక్కలుగా చేస్తేనే కదా
మనం నూలు పరుపులపై నులి వెచ్చగా
నిద్రపోయేది

వాళ్లు మట్టి వాసనలు వెదజల్లితేనే కదా
మన ప్రగతికి దారులు దృఢంగా పడేది
వాళ్ల చెమట చుక్కల తోటి
ఎంతోమంది పునాదులు గట్టి పడ్డాయి.
వాళ్ల అరిగిన హస్తాల తోటి
మన నగరాలు నందనవనంగా మారాయి

మనం స్వేచ్ఛా వాయువులు పీల్చబట్టి
ఏకంగా ఏడు దశాబ్దాలు దాటినా
ఎన్నుకున్న ఏలికలకు ఎజెండా లేదు
ఎంచుకున్న మార్గాలకు సత్తువ లేదు
బడుగుజీవుల బతుకుల్లో వెలుగు లేదు

పల్లు బట్టిన అంగీలు, చిల్లు బట్టిన లుంగీలు
నెర్రబారిన గోడలు, నీళ్లు గారుతున్న పైకప్పులు,
పాసిపోయిన అన్నం, పచ్చడి మెతుకులతోటి
వాళ్లు కాలం వంతెనపై
భారంగా కదులుతున్నారు.
జీవిత రేఖను మార్చే సూర్యుడి కోసం
వేయి కండ్లతోటి ఎదురుచూస్తున్నారు

తాటిపాముల రమేశ్
79815 66031

వచన కవిత్వ వైచిత్రి

వెయ్యేండ్ల తెలుగు సాహిత్యంలో ఎనిమిది వందల ఏండ్ల సాహిత్యం ప్రాచీన సాహిత్యం, మిగిలిన రెండు వందల ఏండ్ల సాహిత్యం ఆధునిక సాహిత్యం. ప్రాచీన సాహిత్యంపై సంస్కృత ప్రభావం, ఆధునిక సాహిత్యంపై ఆంగ్ల ప్రభావం బాగా కనిపిస్తుంది. సాహిత్యాన్ని నిశితంగా అధ్యయనం చేయాలంటే ఆయా కాలాల్లో ఆయా కవులకున్న సాహిత్య దృక్పథంతో పాటు వారు సృష్టించిన రచనలు ఏ ప్రక్రియకు చెందుతాయో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం, అవసరం కూడా.

ప్రాచీన సాహిత్యంలో అనేక ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. అందులో ప్రధానమైనవి ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పదకవిత, ద్విపద, ఉదాహరణం, శతకం, వచనం, చిత్రకవిత, కథాకావ్యం, దండకం ద్వ్యర్థి కావ్యం, అచ్చతెలుగు కావ్యం, యక్షగానం, హరికథ, బుర్రకథ, చాటువు, అవధానం, జానపద కవిత. ఆధునిక సాహిత్యంలో కూడా అనేక రకాలైన ప్రక్రియలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. పద్యం, గేయం, వచనం, వచన కవిత్వం, వ్యాసం, విమర్శ, నాటకాలు, నాటికలు, నృత్యనాటికలు, సంగీత రూపకాలు, కథలు, గేయ కథలు, నవలలు, లేఖలు, జీవిత చరిత్రలు, యాత్రా కథలు మొదలైనవి.

ఆధునికాంధ్ర కవిత్వంతో అభ్యుదయ కవిత్వం, భావకవిత్వాలు ఉద్యమాలుగా స్థిరపడి ప్రత్యేకతను సంతరించుకున్నాయి. భావక విత్వం ప్రభావం తగ్గి అభ్యుదయ కవిత్వం ప్రారంభంలో ఉన్నప్పుడు వచన కవిత్వానికి శ్రీకారం చుట్టింది. అభ్యుదయ కవిత్వాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చిన కవితా ఉద్యమం వచన కవిత్వోద్యమం. వచన కవిత్వానికి పితామహుడిగా కుందుర్తిని పేర్కొంటారు. శ్రీశ్రీ, దాశరథి, సినారె, ఆరుద్ర, సోమసుందర్, శేషేంద్ర, తదితర కవులు వచన కవిత్వాన్ని పరిపుష్టం చేశారు.

కుందుర్తి వచన కవిత్వం కళా ప్రాధాన్యం కలదిగా ఉండాలని భావించారు. ఇంకా సినారె, కేవీ రమణారెడ్డి, సోమసుందర్, సంపత్కుమార్ తదితరులు కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరిచారు. ఆధునికాంధ్ర కవిత్వంలో సినారె ద్వారా గేయ కథా కావ్య నిర్మాణం ప్రారంభమైన పిదప వచన కవిత్వంలో ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి, శీలా వీర్రాజు, సోమయాజులు వంటివారు ప్రముఖులుగా కథాకావ్యాన్ని రాశారు. కుందుర్తి స్వతంత్రంగా రాసిన అభ్యుదయ కావ్యం తెలంగాణం. ఇది వచన కవితా ప్రక్రియ కథా కావ్యం. ఇందులో వారు భూస్వామ్య విధానాన్ని ప్రతిఘటించిన ఒక మహోద్యమాన్ని చిత్రించారు.

'ఒక రైతు పొలం పోయి ఇల్లు చేరుకునే సరికి
ఏలిన దొరవారి ఘనమైన సేవకులు వచ్చి
పెళ్లాం మెళ్లో పుస్తెలు కాజేశారు' ఇది భూస్వాముల అమానుష కృత్యాలకు అంతులేదని చెప్పడానికి నిదర్శనం. వెట్టిచాకిరి కోసం కూలి వాడి పెళ్లాన్ని దొరజప్తు చేయించాడని భావం.

'ప్రతి పల్లె రహస్య జీవితంలోను/ ఒక రాత్రి పాఠశాల ఉంది ఇందులో సంఘం భూస్వాముల దౌర్జన్యాలను సవాలు చేసింది. ప్రజల్లోని చైతన్యం క్రమంగా పోరాట స్థాయికి చేరింది. ఈ నేల ఎవరిది/ కోటి ప్రజల సొత్తు కదా.../ కొందరు వద్దంటే ఒప్పుకోని చరిత్రా!/ ముందుకు పద...'

అన్న కుందుర్తి వచన కవితా శక్తి శ్లాఘనీయం. చరిత్ర గమనంలో నిలిచి దాన్ని ముందుకు పదమని శాసించిన ఆ కవి ఋషితుల్యుడే!

తెలంగాణ ముద్దుబిడ్డ, నిలువెత్తు తెలుగు సంతకం, వివిధ రకాలైన రచనా ప్రక్రియలను సాధికారికంగా రాసి, పదాలను కదం తొక్కించి పదం పాడిన కవితా యోధుడు, స్థితప్రజ్ఞుడై జ్ఞానపీఠంపై వెలిగిన విశ్వంభరుడు సినారె. వారి కావ్య సృష్టి అద్భుతం. సామాన్యుడికి కూడా కవితావేశాన్ని కలిగించి కావ్యరచనకు పురికొలిపే రచనా శైలి ఆయనది.

'చూడగలిగితే/ శూన్యపటం మీద దృశ్యాలు రెపరెపలాడతాయి వినగలిగితే/ మౌన ప్రపంచంలో శబ్దాలు గలగలలాడతాయి/ తెలుసుకో గలిగితే/ శూన్యం లాంటి మౌనమే/ ఒక అపూర్వ దృశ్య వాఙ్మయం' ఇవి వచన కవితా పంక్తులే అయినప్పటికే వినూత్న సృష్టికి, పరవళ్లు తొక్కే అనుభూతికి, అనూహ్యమైన ఉత్తేజానికి, చైతన్య స్ఫూర్తికి, సరికొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకాలు.

శ్రీశ్రీ విప్లవ కవి. శ్రీశ్రీ కవిత్వంలో వేదన, ఆవేదన, నివేదన, ఉత్సాహం, ఉద్దేశం ఉద్రేకం, ధిక్కారముంది. శ్రీశ్రీ శ్రమజీవుల సంపద. శ్రీశ్రీ కవిత్వం ప్రజల ఐక్యతకు గీటురాయి. శ్రీశ్రీ కవిత ప్రజల సమూహానికి ప్రతీక. శ్రీశ్రీ పాట ప్రజల ధిక్కారానికి నినాదం. శ్రీశ్రీ వచన కవితా లోకంలో ఒక వెలుగు రేఖ.

'అలజడి మా
జీవితం/ ఆందోళన
మా ఊపిరి తిరుగు
బాటు మా వేదాంతం/
ముందుకుపోతాం
మేము/ ప్రపంచం మా
వెంట వస్తుంది' ఈ విధంగా వచన కవితా రసధునిలో పాఠక లోకాన్ని ఓలలాడించి, చైతన్య స్రవంతిలో మునకలెత్తించిన శ్రీశ్రీ కవితా లోకానికి ఆదర్శప్రాయుడు. అభ్యుదయ భావ జాలం, విప్లవ గీతం తన ధ్యాసగా, శ్వాసగా జీవించిన విప్లవ కవితా వీరుడు. వచన కవితాయోధుడు, సాహితీ ప్రపంచానికి మార్గదర్శనం చేసిన మహోన్నత కవితా శిఖామణి. అరుణారుణ రాగ రంజిత ప్రభలను వెదజల్లిన వ్యక్తిత్వం ఆయనది.

ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్ర **'దోమల సామ్రాజ్యంలో/ ఈగలు డిక్టేటర్లు/ ఒంటెల సౌందర్యానికి/ వంతపాడు గాడిదలు/ ఇక్కడ పాకే చీమలు హిమాలయ శ్రేణులు'** అంటూ అవకాశవాదుల, స్వార్థపరుల నీచ మనస్తత్వాన్ని తన వచన కవిత్వం ద్వారా తీవ్రంగా ఆగ్రహిస్తూ విమర్శించారు.

అధునాతన కవుల్లో ఒకరైన అలిశెట్టి ప్రభాకర్ తన వచన కవిత్వం ద్వారా కవిత్వం ఎలా ఉండాలో చెప్తూ అక్షరాన్ని అక్షరంగా నిలిపి ఆయుధంగా మలిచారు. **'అక్షరం కపాలం కంతల్లోంచి వెలికి వచ్చే/ క్షుద్ర సాహిత్యపు కీటకమా కాదు/ సౌందర్యం చర్మరంధ్రాల్లో/ తలదూర్చే ఉష్ట్ర పక్షి కాదు/ అక్షరం/ వధ్యశిలపై రాలిపోయే/ నిస్సహాయ శిరస్సు కాదు'** వచన కవిత్వాన్ని, మినీ కవిత్వాన్ని అత్యంత శక్తివంతంగా దట్టించి విసిరిన విప్లవకవి అలిశెట్టి. నూతన అభివ్యక్తితో పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేయడం ఆయన కవిత్వ లక్షణం.

వచనకవితా పితామహుడిగా ప్రఖ్యాతి చెందిన కుందుర్తి ఆంజనేయులు వచన కవిత్వ వికాసానికి విశేష కృషి చేశారు. ఇతరులు వారిని నుకరిస్తూ, ఆచరించి వచన కవిత్వ ప్రాధాన్యాన్ని ఆధునిక కవితా లోకానికి తెలిపారు. ప్రాచీన కవిత్వాన్ని నిరాదరిస్తూ వచన కవిత్వాన్ని కుందుర్తి అభిమానించడం కొందరు కవులకు నచ్చలేదు. భిన్నాభిప్రాయాలను వ్యక్తపరుస్తూ ఎన్నో విమర్శలు చేశారు. అయినా కుందుర్తి జంకలేదు వచన కవితా విచారణలో **'ఉరిశిక్ష పడ్డ/ మొదటి ముద్దాయిని నేను/ అలనాటి కవితా లతాంగిని హత్య చేశాను/ అలంకార ఆభరణాలు అపహరించాను/ అన్నీ ఒప్పేసుకున్నాను ఆనాడు బోనులో ఎక్కి/ కింది కోర్టు వేసిన శిక్షను/ మానవ కారుణ్య దృక్పథంతో సడలించి/ జన్మఖైదు వేశారు హైకోర్టు న్యాయమూర్తులు/ ఒక తరం పాటు బతకాలన్నారు బందీగా/ పాఠకుల గుండెల చెరసాలలో'** అంటూ పాఠకుల ఆదరణే తనకు ముఖ్యమని కుందుర్తి స్పష్టం చేశారు. **'పాతకాలం పద్యమైతే/ వర్తమానం వచన గేయం'** అని ఎలుగెత్తి చాటారు. పద్యానికి పాలించగల సత్తా ఉన్నా గద్యాన్ని గద్దె మీద నిలిపారు కుందుర్తి.

'తెప్పవోలే చంద్రబింబం తేలిపోతా వుంది నింగిని/ అందులో నా ముద్దు ప్రేయసి ఉంది కాబోలు' అని మల్లవరపు విశ్వేశ్వరరావు తన భావ కవిత్వంలో ఆకాశయానం చేశాడు. **'శ్రమజీవుల రుధిరంతో/ ఎరుపెక్కిన ఈ జెండా/ ఎగరేస్తూ మన జెండా/ జయ జయమని పయనిద్దాం'** అని నండూరి రామమోహనరావు అభ్యుదయ బావుటాను ఎగురవేశాడు. **'నాకు బాగా గుర్తుంది/ అప్పుడు నీకు పన్నెండేళ్ళు/ నిన్ను మూలగదిలో కూర్చోపెట్టారు/ ఆ తరువాత నా ఆటల్లో పాటల్లో/ నువ్వెక్కడా లేవు'** అని రవిప్రకాశ్ ఆకెళ్ల స్త్రీవాద కవిత్వంలో తన స్నేహితురాలు ఎక్కడ మాయమైపోయిందో చెప్పాడు. **'నాత్రిల్ల నిద్ర పడ్తలేదు/ అయిను పోరగాల్ల మీద/ నిగరానీ బెట్టింద్రు/ దర్వాజలు గొట్టి జీపులల్ల ఏస్కపోతున్నరు/ ఆగమాగం జేసి పోయింద్రు/ మా కుత్కెల మీద బందూకులు పెట్టి/ కడుపుల దన్ని పోయింద్రు'** అని ఎండ్లూరి సుధాకర్ తెలంగాణలో నక్సలిజం సృష్టించిన అలజడిని కవిత్వీకరించాడు. **'నాగరికత కడుపు మడతల కింద/ చితికిన గజ్జి పుండు బొడ్డు/ ఆకలి మహారణ్యం బురద గుంటలో/ కాళ్లు విరిగి పడ్డ ఈగ మనిషి'** అని ఒక దిగంబర కవి నాగరికత దీపం కింద పరచుకున్న చీకటి మీద కవితా కిరణాన్ని ప్రసరింపజేశాడు.

'కీళ్ళ నొప్పులో ఏమో శ్రీమహా విష్ణువుకు/ ఎప్పుడూ పడుకునే ఉంటాడు/ కాలి దురద ఏమో పరమ శివునికి ఎప్పుడూ ఆడుతూనే ఉంటాడు/ కదలనీయని ముసలితనమో ఏమో చతుర్ముఖ బ్రహ్మకు/ ఎప్పుడూ కూచునే ఉంటాడు/ దొరకదా ఎక్కడైనా లోపం/ వెతకాలి గానీ ఓపిగ్గా' అని ఒక వచన కవి త్రిమూర్తులను కూడా వదలకుండా తన కవిత్వంలో బంధించి వారి లోపాలను ఎండగట్టాడు.

డాక్టర్ సరోజన బండ
93916 07031

(వాసకర్త: అమెరికాలోని వర్జీనియా నుంచి..)

మంచి పుస్తకం నీడన మనసెంతో చల్లన...

అనువాదం థాంక్‌లెస్ వర్క్ అంటారు కానీ, ఇది నిజం కాదు. ఇతర భాషల సాహిత్యం మన కళ్ల లోగిళ్లలో కుప్పపోసే కళ! సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీష్ వంటి విశ్వ భాషలను మన దోసిళ్లలో పోసే కళ! అనువాదకులు వాళ్ల మనసును అదిమిపెట్టి సృజనకారుని మనసును పట్టుకోవాలి. మూలకవి అంతరంగ ఆవిష్కరణ చేయడమంటే అనువాదకుడు ద్విపాత్రాభినయం చేసినట్టే. ముఖ్యంగా కవిత్వాన్ని యథాతథానువాదం చేస్తే సహజత్వం లోపిస్తుంది. స్వేచ్ఛానువాదం చేస్తున్నప్పుడు ఎక్కడైనా భావవైరుధ్యాలు ముప్పిరిగొని అనువాదకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిస్థితి వస్తే 'ఇదిగో ఇక్కడ ఈ వాక్యానికి బదులు ఈ పదానికి బదులు ఇవి జత చేస్తే బాగుండు' అని వాళ్లకనిపిస్తుంది. కానీ, పరిధి దాటి పదాల కూర్పు చేయకూడదు. లక్ష్య భాషలోకి మార్చిన వాచకాంశాలను చదివితే భావంలో తేడా లేకుండా ఉండాలి. కానీ, అంతర్గతంలో కవిత అలజడి చేస్తుంటే అభిముఖంగా మూలకవి నిలబెట్టిన భావాలు కలుగుతూ ఉంటాయి. అలా అని పైపైన చదివి ఉన్నది ఉన్నట్టు తెలుగులోకి తీసుకొస్తే కవితా దీప్తులు ప్రసరించవు.

కవిత నిర్మాణమూ, శైలి జాగ్రత్తగా నడపాలి. మూల కవిత సౌందర్యం చెడకుండా స్పష్టతతో అనువాద కవిత నిర్మించడమనేది సులభమైన విషయమేమీ కాదు. కవి హృదయాన్ని ఆకళింపు చేసుకొని అనువాదకుల హృదయంలోకి వంపుకొని కొత్త మెరుపులు చేర్చాలి. అందుకే అనువాదం థాంక్‌ఫుల్ వర్క్!! అనాలి. చిట్టిప్రోలు సుబ్బారావు (సీఎస్ఆర్) ఏపీజే అబ్దుల్ కలాం 'The Life Tree' పుస్తకంలోని కవిత్వాన్ని తెలుగులోకి అనువదించేందుకు ఎంతగా తమను తాము మథించుకున్నారో పాఠకులు ఈ 'అంతర్నాదం' పుస్తకాన్ని మనసుపెట్టి చదివితే తెలుసుంది.

'విజ్ఞానము దేశభక్తి
రెండు కళ్లైనా, రెండు చేతులైనా,
రెండు ఆయుధాలైనా
ఆ ఉడుకు నెత్తుటి భరత యువతకు
లక్ష్యం చిన్నదంటే పెద్ద నేరం.'

'యువగీతం' అనే ఈ కవిత మొట్టమొదటి కవిత. వ్యక్తిత్వ నిర్మాణం అనేది పటిష్ఠంగా ఉంటే తప్ప ఇటువంటి దేశభక్తి వాక్యాలు జాలువారవు. అబ్దుల్ కలాం భారతదేశాన్ని హృదయపూర్వకంగా ప్రేమించిన సైంటిస్ట్. ఆయనలో రెండు స్రవంతులు, అటు శాస్త్రీయ విజ్ఞానం, ఇటు సంప్రదాయ భారతీయ తత్వమూ ప్రవహించాయి. అందుకే 'ప్రభాస భారతం పల్లవిస్తుంది' అంటారు. 'ప్రజలకు సుఖశాంతులు చేకూరాలి, ఇదే నా ప్రార్థన' అని కూడా అంటారు. ఇంతటి వైవిధ్యమైన పాత్రల్లో ఒదిగిన కలాం కవిత్వం ఎంతటి తర్కాన్ని వెదజల్లిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

కలాం 'Song of Youth' కవితలో 'Small aim is a Crime' అని రాసిన వాక్యాన్ని లక్ష్యం చిన్నదంటే పెద్ద నేరం అని అనువదించారు సీఎస్ఆర్. 'Small aim is a Crime' ఇలా అనడంలో కవిగా కలాం ఆంతర్యం ఏముంటుంది? ఉత్తమమైన మనిషి జన్మను సార్థకం చేసుకోవాలనే ఉద్దేశమే అయి ఉంటుంది. ఎందుకంటే వంద



కోట్ల మందిని రగిలించే ఆ స్వప్నపు నిప్పు రవ్వ నన్నూ దహిస్తోంది అనీ అనటం చూస్తాం. ఇదిగో ఇంతటి సాంద్రతను అనువాదంలోకి తీసుకురావాలి. అందుకే అనువాదకులు వారధి వంటి వాళ్లనడం!

'కాయకష్టంతో బుద్ధిబలంతో
నేల అంతట నేను సారించే
స్వేద జలానికి, జ్ఞాన శరీరానికి
ప్రభాస భారతం పల్లవిస్తుంది కవిత్వం'

అంటే ఒక అనిర్వచనీయ భావనాశక్తికి అక్షర రూపం ఇవ్వడమే. ఇది అనువాద కవిత అనే అభిప్రాయం కలగదు. ఎంత సామాజికంగా కలాం రచించారో అంత స్పష్టంగా తెలుగులోకి అనువదించారు సీఎస్ఆర్. కాయకష్టాన్ని గుప్పిట్లో అదిమిపెట్టి నిరంతర చైతన్య ధారతో సాగాలని ఇలా అనడంతోనే అబ్దుల్ కలాం ఎప్పుడూ సభల్లో యువతకు ఇచ్చే సందేశం గుర్తుకువస్తుంది.

రాష్ట్రపతి పదవికి ముందు రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థలో ఉద్యోగం చేసిన అబ్దుల్ కలాం ఇస్రోలో ఏరో స్పేస్ ఇంజినీర్‌గా పనిచేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థలో విజ్ఞాన తేజో వికాసాన్ని ప్రదర్శించి, భారత దేశపు 'మిస్సైల్ మ్యాన్'గా కీర్తి గడించారు. కలాం అవివాహితులు. వారి తల్లిదండ్రులు వీరి వారసత్వం కొనసాగాలని కోరుకునేవారట. పెళ్లే వద్దనుకున్న కలాం...

'ఎక్కడికి పోతుంది నా జీవితం
చరిత్రలో దిగిపోయిన రాజవంశాలు
చక్రవర్తుల పేరు నిలపని సంతానాలు
తావి వలన పువ్వు తెలిసినట్లు
కర్మల ద్వారానే మనిషి తెలుస్తాడు
కలతలో స్వప్నం తెరుచుకున్న
ఆకాశపు రహదారి
నిప్పులు చిమ్ముకుంటూ ఎగిసిన నూతన క్షిపణి!
వాళ్ల కోరిక తీరింది
పేరు నిలబెట్టే నా మానస పుత్రుడు వచ్చాడు!
వాడి నామధేయం 'అగ్ని'!'

అని అంటారు. ఎంత ఉన్నతమైన వ్యక్తీకరణ తల్లిదండ్రుల ఆశయంపై, ఆశీస్సులపై ఎంత గౌరవం! తాము తయారుచేసిన 'మిస్సైల్'నే తన సంతానంగా భావించారు అబ్దుల్ కలాం. కలాం రచించిన ఈ కవితలన్నింట్లో రెండు అంశాలు వారి గుణాలను ప్రోది చేస్తున్నాయి. ఒకటి, మన వైజ్ఞానిక దృష్టికోణం, మరొకటి కళా సౌందర్య దృష్టికోణం. 2003లో ప్రచురించిన కలాం ఇంగ్లీషు కవితల పుస్తకానికి ముందుమాట రాస్తూ అటల్ బిహారీ వాజపేయ్ 'మత విద్వేషాలు, కుల వైషమ్యాలు, భాషా దురభిమానాలు, ప్రాంతీయ విభేదాలు, హింసకాండలు కలాంకు గిట్టవు. వీరు సౌహార్దశీలంగా సాక్షిభావంతో, సహనశీలంగా సహానుభూతితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.

'అంతర్నాదం' కవిత్వం చదువుతుంటే! 'మంచి పుస్తకం నీడన మనసెంతో చల్లన అనిపించింది' అబ్దుల్ కలాం 'అంతర్నాదం' కవిత్వాన్ని చదువుతున్నంతసేపు.!!



డాక్టర్ కొండపల్లి నీహారిణి

ద్రుమ దృశ్యం

తూరవానల తోరణంబున తోషణాతిశయంబునన్
తోరమౌ తరువిత్తనంబులు తోపుగా మొలకెత్తగన్
తీరు తీరు పతేరజాతులు తేమ తెంచుచు తూగగన్
దారుణీ ద్రుమదృశ్య సంపద దైవమే దయచేయగన్

పిండిలంబులు మండలంబున వింగడంబుగ నాడగన్
కొండనిండ ప్రకాండముండగ కొంగ లండగ జేరగన్
బండలందున మెండు వెండిగ పాండువున్ పడవేయగన్
అండదండ శిఖండి దండిగ నాడి దండున కాలిడన్

దారులందున హారమై హరితంబుతో తరులూగగన్
సారుతో చిరునవ్వు తీరున సానువుల్ తరియించగన్
పారజాడగ నూరిమేరలు పచ్చరంగును రుద్దగన్
భారమెంచక దూరతీరపు బాటసారులు సాగగన్

అంతులేని హరిత్తు తోటల అంతలయ్యెను చిత్తుగన్
చింతలేక పత్రమ్ముల్ కడు చిత్ర తచ్చన లాడగన్
పంతుతో తలలూపి నృత్య ప్రభావ మంతయు చూపగన్
వింత వింత వినూతనత్వము విస్తరించెను పృథ్విలోన్

పూట్ల భద్రయ్య
9550256840

వానదృశ్యం

ఎడతెగని వాన
బయటా? లోనా?

మెత్తని మేఘాలు
పిండి ఆరేసిన బట్టల్లా
వేలాడుతూ..,

మడిగట్టుకున్న భూమి
వంటలకు సిద్ధంగా,
బురదంటావా?
బురద నుంచే అన్నం
తామరపువ్వు విరుస్తుంది..

పచ్చిగాలి
ముఖాల మీద కప్పుకున్న
పల్చటి తడి దుప్పటిగా..

గుంతలలో నిలిచిన నీళ్ల అద్దంలో
ఆకాశం తన ముఖం
చూసుకుంటూ మురుస్తూ..

పొలంలో దిగిన రైతు తాత
బలం లాగ
లోకాన్ని చైతన్య పరుస్తూ..

వానదృశ్యం
బయటా! లోనా!

డాక్టర్ కాసర్ల నరేశ్ రావు
94414 06252

తెలంగాణ మాగాణంలో సాహితీ శిఖరం సామల

తెలుగు సాహితీ వనంలో సామల సదాశివుడు ఒక తోటమాలి. తన రచనల పూలతో తెలంగాణ తల్లిని అర్చించిన సరస్వతీమూర్తి. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా, ప్రవృత్తి రీత్యా సాహిత్యాభిలాషి. తెలుగు, హిందీ, మరాఠీ, పారసీ, ఉర్దూ, ఇంగ్లీష్, సంస్కృతం వంటి ఏడు భాషల్లో ప్రతిభా పాండిత్యం కలిగిన వ్యక్తి. ఇతర భాషల్లో వెలువడిన సాహిత్యాన్ని తెలుగు సాహితీ ప్రపంచానికి అందించిన విభిన్న భాషా సంస్కృతుల కళావారధి.

'మనసు ఆనందంతో, ఉల్లాసంతో ఉరకలేస్తున్నప్పుడు లేదా రోదిస్తున్నప్పుడు రాసే రచనల్లో మన భావాల్లోని శబ్దాలు వాటంతటవే వచ్చి కూర్చుంటాయి' అని అంటారు సామల. అందుకే ఆయన రచనా శైలి అంత స్వాభావికంగా ఉంటుంది. నేటి కొమురంభీం జిల్లాలో భాగమైన దహెగాం మండలంలోని 'తెలుగుపల్లె'లో 1928, మే 11న నాగయ్య-చిన్నమ్మ దంపతులకు సామల సదాశివుడు జన్మించారు. ఆయన తన చిన్నతనంలోనే రామాయణ మహాభారతాలు, బసవ పురాణం, కళాపూర్ణోదయం వంటి పుస్తకాలు చదివారు.



1949లో 'ప్రభాతము' అనే పద్య కావ్యాన్ని రాసి సాహితీ లోకంలోకి ప్రవేశించారు. 1950లో 100 పద్యాలతో 'సాంబశివ శతకం'ను రాశారు. 41 పద్యాలతో 'అంబాపాలి' రచించారు. బుద్ధుడి ప్రత్యక్ష బోధనల ప్రభావం వల్ల వేశ్యా వృత్తిని వదిలి సన్యాసిగా మారిన వనితే 'అంబాపాలి'. 'సర్వస్వదానము', 'పశ్చాత్తాపము', 'విశ్వామిత్రము', 'నారద గర్వభంగం', తదితర రచనలలో సామల శైలి అద్భుతంగా కనిపిస్తుంది. ఆంధ్ర బిల్హణ బిరుదాంకితులు కప్పగంతుల లక్ష్మణశాస్త్రితో పరిచయం సామలను ఒక పరిపూర్ణ సాహితీవేత్తగా తీర్చిదిద్దింది.

కవి మిత్రుడు హనుమంతరావుతో కలిసి 'వృషభగిరి నివాస వెంకటేశా' అనే మకుటంతో 102 పద్యాలు గల ఆర్తి శతకాన్ని రాశారు. గోలకొండ పత్రికకు పద్యాలు రాసే క్రమంలో కవికేసరి సురవరం ప్రతాపరెడ్డి మన భాష సుగంధాన్ని ఇతర భాషలకు అందించమన్న సూచనతో పద్య కవిత్వాన్ని వదిలి అనువాదకుడిగా మారారు. ఉర్దూ పత్రికలకు తెలుగు సాహిత్యం గురించి, అలాగే ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగు ప్రపంచానికి అందించి సాహిత్య వారధి అయ్యారు. 'సియాసత్' పత్రికకు అనేక వ్యాసాలు రాశారు. ఉర్దూలో 300 వ్యాసాలు, తెలుగులో 450 వ్యాసాలు రచించారు. సామల రచించిన 'అపశృతి' నవల అత్యంత ప్రజాదరణ పొందింది. 'అంజద్' రుబాయీలను ఉర్దూ నుంచి తెలుగులోకి అనువదించి ఏపీ ఉత్తమ అనువాద పురస్కారం అందుకున్నారు. భాష ఏదైనా తన రచనలను ముచ్చట రూపంలో పాఠకులకు అందించడమే సామల ప్రత్యేకత.

సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు అందరితో ఉన్న తన అనుభవాలను, జ్ఞాపకాలను తిరుగులేని విధంగా, ఎవరూ మరిచిపోలేని విధంగా, మరొకరు అనుకరించలేనంత గొప్పగా, ధారావాహికగా, అమృతవర్షంగా కురిపించిన జ్ఞాపక రచనల గొప్ప వచన శిల్పం 'యాది'. ఇది 2005లో గ్రంథస్థమైంది. 'యాది' అంటేనే సామల సదాశివుడు అన్నంతగా గుర్తింపు తెచ్చింది. సదాశివుడు 7వ తరగతి చదివేటప్పుడు 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరాడిన విప్లవ వీరుడు కొమురం భీం చనిపోయారు. ఆయన మృతదేహాన్ని సామల చదువుకునే స్కూల్ పక్కన ఉన్న దవాఖానలో పంచనామా నిమిత్తం ఉంచారు. అది తెలుసుకున్న సామల కొమురం భీం మృతదేహాన్ని కండ్లారా చూశారు. ఆ సంఘటన తన జీవితంలో మరువలేనని తన 'యాది'లో చెప్పుకొన్నారు. సామలకు 1980లో ఏపీ ప్రభుత్వం పాఠ్యపుస్తక ప్రచురణ సంస్థ నుంచి 7వ తరగతి తెలుగు వాచకం రాసే అవకాశం వచ్చింది. దీంతో ఆయన కొమురం భీం పాఠాన్ని పొందుపరిచి తెలంగాణలో మరుగున పడ్డ పోరాట వీరుడిని ప్రపంచానికి పరిచయం చేశారు. 1968 నుంచి 83 వరకు ఏపీ సాహిత్య అకాడమీ ఉర్దూ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా, 1991 నుంచి 94 వరకు కేయూ సెనేట్ సభ్యునిగా సామల సేవలందించారు. 1998లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2002లో కాకతీయ యూనివర్సిటీలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు అందించాయి. 2006లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 'ప్రతిభ రాజీవ్ పురస్కార అవార్డు' అందుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే సామల సదాశివుడు తెలంగాణ మాగాణంలో ఒక 'సాహితీ శిఖరం'. 2012 ఆగస్టు 7న ఈ లోకాన్ని విడిచిన సామల సదాశివుడు తెలుగు సాహితీ ప్రియులకు 'యాది'గా మిగిలిపోయారు. దాశరథి, కాళోజీ లాంటి కవుల సమకాలికుడిగా ఎదిగిన సామల పేరిట ప్రభుత్వం ఓ పురస్కారాన్ని అందివ్వాలని యావత్ సాహితీ లోకం కోరుకుంటున్నది.

ములక సురేష్
944 132766

(ఈ నెల 7న సామల సదాశివుని వర్ధంతి)